క్లుప్తంగా

ఆత్మహత్యలపై అవగాహన అవసరం

సబ్ ఇన్‌స్పెక్టర్ పాండు



మాట్లాడుతున్న ఎస్‌ఐ పాండు

జోగిపేట(అందోల్): చిన్నచిన్న విషయాలకే ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇలాంటి విషయాలపై లయన్స్‌క్లబ్, పోలీస్‌శాఖ కలిసి ప్రజల్లో అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపట్టాలని జోగిపేట ఎస్‌ఐ పాండు సూచించారు. మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పది మంది డాక్టర్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. డాక్టర్లు కరోనా సమయంలో అందించిన సేవలు వెలకట్టలేమన్నారు. తెగించి విధులు నిర్వహిస్తూ ఎంతో మంది ప్రాణాలు కాపాడుతారన్నారు. రాష్ట్ర ఫెడ్కాన్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. కనిపించే దేవుళ్లు డాక్టర్లని, ఒక రోగిని కాపాడేందుకు వారు యముడితో కొట్లాడతారని ఉదహరించారు. వారి సేవలు అభినందనీయమన్నారు. మాజీ జోగిపేట సర్పంచ్ ఎస్.కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. మంత్రి దామోదర కృషి వల్ల 150 పడకల ఆస్పత్రి అందోల్‌లో నిర్మిస్తున్నారని, వైద్య సేవలపై ఆయన ప్రత్యేక దృష్టి ఉందన్నారు.

ఘనంగా ఆవిర్భావ వేడుకలు



వేడుకల్లో నాయకులు తదితరులు

నారాయణఖేడ్: ఖేడ్‌లోని సేవాలాల్ చౌక్ వద్ద మంగళవారం లంబాడా హక్కుల పోరాట సమితి 29వ ఆవిర్భావ వేడుకలను ఆ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రకాష్ రాథోడ్, జిల్లా అధ్యక్షుడు సురేష్‌నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్‌చేసి పంచిపెట్టారు. పరస్పరం మిఠాయిలు తినిపించుకున్నారు. 29 ఏళ్లుగా సంఘం చేసిన సేవా కార్యక్రమాలను గురించి వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక లంబాడా, గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తుందని కొనియాడారు. కాంగ్రెస్ నాయకులు సాగర్ షెట్కార్, సంఘ డివిజన్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల ఆర్డర్లు అందజేత



ఎన్నికల విధుల ఆర్డర్లు అందజేస్తున్న మోహన్

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధుల నిర్వహణకు బీఎల్‌ఓలకు సూపర్‌వైజర్లు ఆర్డర్లు అందజేశారు. తహసీల్దార్ భాస్కర్ ఆదేశాల మేరకు మండలంలోని 43 పోలింగ్ కేంద్రాల్లో నలుగురు రెవెన్యూ సిబ్బంది మంగళవారం పోలింగ్ బూత్‌లకు తిరిగి పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, డీలర్లు పాల్గొన్నారు.

లోంక తండాలో జ్వరాలు



వైద్య శిబిరం ఏర్పాటు చేసిన సిబ్బంది

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం లోంక తండాలో గిరిజనులు జ్వరాలతో మంచం పట్టారు. ఈ క్రమంలో మంగళవారం తండాలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గిరిజనులు జ్వరాలు, సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నారని స్థానికులు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. 30 మందికి పైగా జ్వరాలతో బాధపడుతూ.. ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. అధికారుల ఆదేశాలతో సిర్గాపూర్ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సురేఖ, రాంచందర్ , తారసింగ్, తదితరులు తండాను సందర్శించారు. జ్వరం బాధితులను పరీక్షలు చేశారు.

మనూరులో 54.6 మి.మీ

నారాయణఖేడ్: ఖేడ్ ప్రాంతంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులకు ఊరటనిచ్చింది. వర్షాకాలం ప్రారంభం అయ్యాక మొదట్లో వర్షాలు కురిసి తర్వాత ముఖం చాటేయడంతో విత్తిన విత్తనం మొలకలు ఎండుదశ పట్టాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు అన్ని రకాల పంటలకు జీవం పోసినట్లయ్యింది. మనూరు మండలంలో 54.6 మి.మీ, నాగల్‌గిద్దలో 36, నారాయణఖేడ్‌లో 34.4, కంగ్టిలో 26.4, సిర్గాపూర్‌లో 24.6, కంగ్టిలో, నిజాంపేట్‌లో 18.4, కల్హేర్‌లో 2.0మి.మీ వర్షపాతం నమోదయింది.

జోరుగా వ్యవసాయ పనులు

- పెట్టుబడి సాయంతో అన్నదాత హర్షం
- కలుపుతీత పనుల్లో బిజీబిజీ



పత్తిలో కలుపు తీస్తున్న కూలీలు

జహీరాబాద్ టౌన్: ప్రభుత్వం అందించిన పెట్టుబడి సాయంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడి సాయంతో రైతులు వానాకాలం సీజన్ పనుల్లో మునిగిపోయారు. ఇప్పుడిప్పుడే వర్షాలు కురుస్తుండటంతో ఊరట చెందుతున్నారు. వానల ప్రారంభంలో వేసిన పంటలతో పాటు కలుపు మొక్కలు పెరిగాయి. రైతు భరోసా డబ్బులు అందడంతో కలుపుతీత పనులు ప్రారంభించారు. పత్తి పంటకు సస్యరక్షణ చర్యల కోసం మందులను సమకూర్చుకుంటున్నారు. రైతు భరోసా పథకం కింద జహీరాబాద్ వ్యవసాయ డివిజన్ పరిధిలోని 143 గ్రామాల్లో 80,294 మంది రైతులకు రూ.113.37 కోట్ల నిధులు మంజూరయ్యాయి. న్యాల్‌కల్ మండలంలో 18,411 మంది రైతులకు రూ.27.3148 కోట్లు, జహీరాబాద్ మండలంలో 15,682 మంది రైతులకు 22.9734 కోట్లు, ఝరాసంగం మండలంలో 17,819 మంది రైతులకు రూ.22.6450 కోట్లు, కోహీర్‌లో15,397 మంది రైతులకు రూ.22.0384 కోట్లు, మొగుడంపల్లి మండలంలో 12,895 మంది రైతులకు రూ. 18.40,52 కోట్లు రైతుల ఖాతాలో జమయ్యాయి.

కొత్త రైతులకు కూడా డబ్బులు జమ

జహీరాబాద్ డివిజన్‌లోని రైతులకు రైతు భరోసా నిధులు ఖాతాలో జమ అయ్యాయి. కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు అందుకున్న రైతుల నుంచి ఇటీవల దరఖాస్తులు స్వీకరించాం. రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. బ్యాంక్ అకౌంట్ నంబర్లు ఇచ్చిన వారికి డబ్బులు పడ్డాయి. మిగతా వారికి త్వరలో జమ అవుతాయి. **-భిక్షపతి, ఏడీఏ, జహీరాబాద్**





ధర్నా చేస్తున్న లబ్ధిదారులు, నాయకులు

డబుల్ ఇళ్లు అప్పగించాలని ధర్నా

జహీరాబాద్ టౌన్: డబుల్ బెడ్ రూం ఇళ్లను అప్పగించాలని లబ్ధిదారులు సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం జహీరాబాద్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా డివిజన్ నాయకుడు మహిపాల్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో హోతి(కె)వద్ద పేదల కోసం డబుల్‌బెడ్ రూం ఇళ్లను నిర్మించింది. డ్రా పద్ధతి ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేపట్టి అధికారులు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు ఇళ్లను అప్పగించకుండా జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. 20 రోజుల్లో అప్పగిస్తామని రెవెన్యూ అధికారులు హామీ ఇచ్చి పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. వెంటనే ఇళ్లను అప్పగించాలని లేని యెడల లబ్ధిదారులు గృహప్రవేశాలు చేరస్తారని హెచ్చరించారు. తహసీల్దార్ దశరథ్ ఆందోళనకారులతో ఫోన్‌లో మాట్లాడారు. వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ధర్నా కార్యక్రమంలో సీపీఎం నాయకులు తిరుపతి, సలీమోద్దీన్, బక్కన్న, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నెలలోనే పెన్షన్ ప్రయోజనాలు

ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ విశాల్ అగర్వాల్



పెన్షన్ పత్రాలు అందజేసిన విశాల్ అగర్వాల్

పటాన్‌చెరు టౌన్: పదవీ విరమణ పొందిన నెలలోనే పెన్షన్ ప్రయోజనాలు పొందేలా లక్ష్యంగా పెట్టుకున్నామని ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ విశాల్ అగర్వాల్ అన్నారు. మంగళవారం పదవి విరమణ పొందిన చందాదారులకు పెన్షన్ చెల్లింపు ఆర్డర్ కాపీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... జూన్ నెలలో పదవీ విరమణ పొందిన 60 మంది చందాదారులకు పీపీఓలను జారీ చేసి అందులో 26 మందికి అందజేయడం జరిగిందన్నారు. అనంతరం పదవీ విరమణ ప్రయోజనాలను పొందే ప్రక్రియను వేగవంతం చేసినందుకు లబ్ధిదారులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ 2 ప్రశాంత్ ప్రియదర్శి, అకౌంట్స్ ఆఫీసర్ అబ్దుల్, అజీమ్ పాల్గొన్నారు.

కరెన్సీపై అంబేడ్కర్ చిత్రాన్ని ముద్రించాలి



పోస్ట్‌కార్డు ఉద్యమం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సంగారెడ్డి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని కరెన్సీ నోట్లపై ముద్రించాలని సాధన సమితి జాతీయ అధ్యక్షుడు పరుశురాం ఆధ్వర్యంలో పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. మంగళవారం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను సంగారెడ్డి కలిసి పోస్టు కార్డు ఉద్యమం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్ భిక్షపతి, కాసాల బుచ్చిరెడ్డి, రిటైర్డ్ హెడ్ మాస్టర్ అనంతయ్య, పట్టణ కార్యదర్శి నర్సింలు, అశోక్‌కుమార్, విజయరావు, చిన్న, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

చెత్త రిక్షాలతో నిరసన



నిరసన తెలుపుతున్న స్వచ్ఛ ఆటో కార్మికులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని చెత్త డంపింగ్ యార్డ్‌కు తాళం వేశారు. దీంతో స్వచ్ఛ ఆటో కార్మికులు మంగళవారం చెత్త కూడిన ఆటోలను మున్సిపల్ కార్యాలయం ఎదుట నిలిపి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. కొద్ది రోజులుగా చెత్త డంపింగ్ యార్డ్‌లో చెత్తను డంపు చేయనికుండా పలువురు అడ్డుకుంటున్నారని తెలిపారు. అధికారులు మాత్రం డంపింగ్ యార్డ్‌లో చెత్త డంపింగ్ చేయమంటున్నారని వివరించారు. తమ సమస్యను ఎవరు పట్టించుకోవడంలేదని వాపోయారు. అందులో భాగంగా చెత్త రిక్షాలతో నిరసన తెలిపినట్లు వివరించారు. అనంతరం అధికారులు డంపింగ్ యార్డ్‌కు చెత్త రిక్షాలను తరలించారు.

టీబీ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం



టీబీ ముక్త్ కార్యక్రమం పరిశీలిస్తున్న ఎంపీడీఓ

వట్‌పల్లి(అందోల్): టీబీ వ్యాధి నివారణే లక్ష్యంగా టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎంపీడీఓ అంజయ్య అన్నారు. మంగళవారం మండలంలోని గొర్రెకల్‌లో టీబీ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. క్షయ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సంగీత, ఏఎన్‌ఎం పుష్పలత, పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య, వీఓఏ సంజీవులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన మంత్రి దామోదర

పేద కుటుంబానికి చెందిన ఆదర్శ్ వైద్యానికి సాయం



మంత్రి దామోదరను తన కుమారుడి చికిత్సకు సాయం చేయాలని అడుగుతున్న శ్వేత

పటాన్‌చెరు టౌన్: సంగారెడ్డి జిల్లా... సదాశివపేట మండలం రెజిచింతలలోని నిరుపేద కుటుంబానికి చెందిన శ్వేత తన కుమారుడు ఆదర్శ్ (రెండున్నర సంవత్సరాలు) భవనంపై నుంచి పడిపోవటంతో పటాన్‌చెరులోని ధ్రువ ఆసుపత్రిలో చికిత్స కోసం 19 రోజుల క్రితం అడ్మిట్ చేసింది. తన కుమారుడు ఆదర్శ్‌కు చికిత్స నిమిత్తం డబ్బులు లేకపోవడంతో దిక్కుతోచని పరిస్థితిలో ఉండగా...అదే ఆస్పత్రిలో పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో జరిగిన ప్రమాద ఘటనలో గాయపడిన క్షతగాత్రులను పరామర్శించేందుకు వచ్చిన మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి తన నిస్సహాయతను వెల్లడించింది. దీనికి చలించిన మంత్రి దామోదర ఆదర్శ్ చికిత్సకు అవసరమైన డబ్బులు తన స్వయంగా చెల్లిస్తానని ఆస్పత్రి యాజమాన్యానికి తెలియజేశారు. ఈ సందర్భంగా శ్వేత మీడియా ముఖంగా మంత్రి దామోదరకు కృతజ్ఞతలు తెలిపింది.

కార్మికుడిని ఆదుకోవాలి

జహీరాబాద్ టౌన్: ప్రమాదంలో చేతిని కోల్పోయిన కార్మికుడిని ఆదుకోవాలని సీఐటీయూ జహీరాబాద్ కన్వీనర్ మహిపాల్ ముంగి పరిశ్రమ యాజమాన్యాన్ని కోరారు. పట్టణ సమీపంలోని ముంగి ఇంజనీరింగ్ పరిశ్రమలో చోటు చేసుకున్న ప్రమాదంలో కార్మికుడి శ్యామయ్య చేయి కోల్పోయి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనను మంగళవారం మహిపాల్ తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ.. చేయి కోల్పోయిన కార్మికుడికి రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలని, ఆస్పత్రి ఖర్చులు భరించాలని కోరారు. ఆయన వెంట సందీప్‌రెడ్డి, నారాయణ, శివరామరావు, నర్సింహ్మారెడ్డిలున్నారు.

వైద్యులు ఫలితమే పునర్జన్మ

సంగారెడ్డి క్రైమ్: జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్‌కుమార్, ఆర్‌ఎంఓ ఆంజనేయులను జనజాగృతి సేన అధ్యక్షుడు బంగారు కృష్ణ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బంగారు కృష్ణ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు జన్మనిస్తే వైద్యులు పునర్జన్మ ఇస్తారని అన్నారు. ప్రజలకు నిస్వార్థంగా సేవలందించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయ్, భాస్కర్ ఉన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జాతీయ స్థాయిలో నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డు కోసం జిల్లాలోని ఉపాధ్యాయులు ఈ నెల 13 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు., http://nationaawarsot Šreacherr. education.gov.in అనే వైబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తరువాత ప్రింట్ తీసుకొని సంబంధిత పత్రాలను 13వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు డీఈఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

అధికారుల సూచనలు పాటించాలి

రాయికోడ్(అందోల్): ఎరువుల వినియోగంలో అధికారుల సూచనలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి సారిక అన్నారు. మండలంలోని రాయిపల్లి గ్రామంలో రైతులు సాగు చేసిన పత్తి పంటను పరిశీలించారు. పత్తి పంటకు వినియోగించాల్సిన ఎరువుల రకాలు, మోతాదుపై అవగాహన కల్పించారు. మండలంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు పత్తిలో ఎరువులు చల్లుకోవడంపై దృష్టి సారించాలన్నారు. పంట పొలాల్లో వర్షపు నీరు నిల్వకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు ఉన్నారు.

ఇళ్ల మంజూరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అవకతవలు చోటు చేసుకున్నట్లు న్యాల్‌కల్ మండల బీజేపీ నాయకులు విద్యాసాగర్ పాటిల్, ఓంకార్ యాదవ్, బసప్ప రాజోల ఆరోపించారు. ఈ క్రమంలో మంగళవారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అర్హులను గుర్తించేందుకు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించకుండా అనర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేశారని, ఫలితంగా అర్హులైన వారికి అన్యాయం జరిగిందని ఆరోపించారు. విచారణ జరిపి అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలని వినతి పత్రంలో కోరారు.

8న అరుణాచలానికి ప్రత్యేక బస్సు

నారాయణఖేడ్: గురుపౌర్ణమను పురస్కరించుకొని ఈనెల 10న గిరి ప్రదక్షణలో పాల్గొనేందుకు భక్తుల సౌకర్యార్థం అరుణాచలానికి ప్రత్యేక బస్సును ఏర్పాటు చేశారు. ఈనెల 8న సా. 4 గంటలకు ఖేడ్ నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం మల్లేశయ్య, మార్కెటింగ్ సెల్ ఇన్‌చార్జి పాండు తెలిపారు. ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట్ బస్టాండ్ నుంచి బస్సు బయలుదేరి కాణిపాకం, వేలూరు గోల్డెన్ టెంపుల్‌ల దర్శనానంతరం 10న అరుణాచలం చేరుకుంటుందన్నారు. అక్కడ గిరిప్రదక్షణ అనంతరం సా.6 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 11న అలంపూర్ జోగులాంబ తల్లి శక్తిపీఠాన్ని దర్శించుకుని అదే రోజు రాత్రికల్లా ఖేడ్‌కు చేరుకుంటుందని వివరించారు. ఒకొక్కరికి రూ.4,500 చార్జీ మాత్రమే ఉంటుందన్నారు.

పాఠశాలల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

కొండాపూర్(సంగారెడ్డి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో భాగస్వామ్యం కావడంతో పాటు ఇతర మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం గొల్లపల్లి వాస్తవ్యులు శ్రీధర్ రెడ్డి తన జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ పాఠశాలలో సురక్షిత మంచి యంత్రం ,విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. మనిషి జీవనానికి అవసరమయ్యే మంచినీటి యంత్రంతో పాటు విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేయడం శుభపరిణామమన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి..



మజారుద్దీన్‌ను సత్కరిస్తున్న అధికారులు

జహీరాబాద్: ఉద్యోగి విధి నిర్వహణలో అందించిన సేవలే చిరకాలంగా గుర్తింపునిస్తాయని జహీరాబాద్ డివిజన్ నీటిపారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మొగుడంపల్లి మండల నీటిపారుదల శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ మజారుద్దీన్ పదవీ విరమణ సందర్భంగా కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నిక్కచిగా బాధ్యతలు నిర్వహిస్తూ మజారుద్దీన్ మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. పదవీ విరమణ ప్రతి ఉద్యోగికి తప్పనిసరి అని, అయితే తనకు ఉన్న అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని అవసరం అయితే మళ్లీ స్వచ్ఛందంగా తన శాఖకు సేవలందించాలని కోరారు. ఈ సందర్భంగా మజారుద్దీన్‌లు శాలువా, బొకేతో సత్కరించారు. కార్యక్రమంలో డీఈఈలు రాజ్యలక్ష్మి, భార్గవి, సూపరింటెండెంట్లు వెంకట్‌రెడ్డి, అనిల్‌కుమార్, గంగాధర్, నాగరాజ్, విజయ్, గిరిప్రసాద్, శంకర్, తులసి, బషీర్, జాషువా, ఇంజనీర్లు జానకీరాం, అయూబ్, లలిత, జగన్నాథ్, శ్రీనివాస్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పదవి విరమణ సహజమే

ఝరాసంగం(జహీరాబాద్): ప్రతి ఉద్యోగికి పదవి విరమణ సహజమేనని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్ రావు పాటిల్ అన్నారు. కేతకీ సంగమేశ్వర ఆలయంలో విధులు నిర్వహిస్తున్న భద్రన్న పదవీ విరమణ చెందడంతో ఆలయ ఆవరణలో సోమవారం సన్మాన సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ చంద్రశేఖర్ పాటిల్, ఈఓ శివ రుద్రప్ప, నాయకులు ఉదయ్ శంకర్ పాటిల్, మల్లయ్యస్వామి, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండ

కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్



సమావేశంలో పాల్గొన్న నీలం మధు

పటాన్ చెరు టౌన్: సిగాచి పరిశ్రమలో బాధితులైన ప్రతి కుటుంబానికి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు.మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు దామోదర రాజనరసింహ, వివేక్ వెంకటస్వామి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు లతో కలసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మృతుల కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారాన్ని కంపెనీ యాజమాన్యం ద్వారా అందించడంతో పాటు క్షతగాత్రులకు రూ. 10 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల పిల్లలకు ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్ లో విద్యను అందిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించారు. కార్యక్రమంలో సీఎం సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసి చైర్మన్, డీసీసీ అధ్యక్షులు నిర్మలా, చైర్మన్ ఎంఏ ఫహీం, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బస్సు పునరుద్ధరణ



బీదర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు

న్యాల్‌కల్(జహీరాబాద్): నారాయణఖేడ్ నుంచి న్యాల్‌కల్ మీదుగా బీదర్ వెళ్లే బస్సు సర్వీస్‌ను మంగళవారం ఆర్టీసీ అధికారులు పునరుద్ధరించారు. న్యాల్‌కల్ మీదుగా బీదర్‌కు వెళ్లేందుకు బస్సు సర్వీలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని , నారాయణఖేడ్ నుంచి బీదర్‌కు బస్సును నడిపించాలని నెల రోజుల క్రితం న్యాల్‌కల్ గ్రామస్తులు ఖేడ్ డిపో మేనేజర్‌కు విజ్ఞప్తి చేశారు. అందుకు సానుకూలంగా స్పందించి న్యాల్‌కల్, డప్పూర్, అత్నూర్ మీదుగా బీదర్‌కు బస్సు సర్వీస్‌ను ప్రారంభించారు. బస్సును పునరుద్ధరించడంపై ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు.

సొంత నిధులతో అభివృద్ధి పనులు



ఆయా గ్రామాల నాయకులకు నిధులు అందజేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని కొడకంచి, కొర్లకుంట, జిన్నారం గ్రామాలకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తన సొంత నిధులను అందించి ఉదారతను చాటుకున్నారు. కొర్లకుంట గ్రామంలో నిర్మిస్తున్న చిత్తరమ్మ దేవాలయానికి గతంలో రూ.26 లక్షలు అందించగా, మంగళవారం ఆలయ అదనపు పనుల నిమిత్తం మరో రూ.2 లక్షలను కమిటీ సభ్యులకు అందజేశారు. మండల కేంద్రంలో నిర్మిస్తున్న శివాజీ స్టేడియం బోర్డు ఏర్పాటుకు రూ.37వేలు, గురుకుల పాఠశాల మంచినీటి పైప్‌లైన్ల ఎర్తింగ్ పనుల కోసం రూ.90 వేలు, కొడకంచి గ్రామంలో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు రూ.లక్ష అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలోని దేవాలయాలు, మసీదులు, చర్చిలు కుల సంఘాల భవనాల అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తున్నాన్నారు. అభివృద్ధిలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మాజీ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, నాయ కులు అంజిరెడ్డి, నరసింహారెడ్డి, శివరాజ్ పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య

పటాన్‌చెరు టౌన్: అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం పటాన్‌చెరు పర్యటన నేపథ్యంలో ముందస్తుగా సీఐటీయూ, సీపీఎం నాయకులను అరెస్టులు చేయడాన్ని రాజయ్య తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....అమీన్‌పూర్, పటాన్‌చెరు, సంగారెడ్డి, సదాశివపేట, కొండాపూర్ తదితర ప్రాంతాలలో సీఐటీయూ, సీపీఎం నాయకులను అరెస్టు చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పడటం హేయమన్నారు. పరిశ్రమలో ప్రమాదం జరిగి అనేకమంది చనిపోతుంటే అరెస్టులు చేయడం ఏమిటని ఆయన అన్నారు. సిగాచి పరిశ్రమ ప్రమాదంలో మృతి చెందిన కార్మిక కుటుంబాలను అన్ని రకాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400